క్లుప్తంగా

సీఐగా సాయిరమణ



దుగ్గొండి : స్థానిక సీఐగా సాయిరమణ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీఐ రాజగోపాల్ రెండు నెలల క్రితం పర్వతగిరికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జనగామ జిల్లాలోని నర్మెట సీఐగా పని చేస్తున్న సాయిరమణను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీఐ సాయిరమణను దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్సైలు నీలోజు వెంకటేశ్వర్లు, ప్రశాంత్, రఘుపతి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీఏఎస్ మండల కన్వీనర్‌గా అమరేందర్



వర్ధన్నపేట : మండలంలోని బండౌత పురం గ్రామానికి చెందిన మంద అమరేందర్‌ను తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) మండల కన్వీనర్‌గా నియమించినట్లు జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో అమరేందర్ మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయనున్నట్లు తెలిపారు. బడుగుల సమస్యల పరిష్కారానికి పోరాడతామని చెప్పారు.

అవార్డు



నర్సంపేట రూరల్ : ఇంఫాక్ట్ ట్రైనర్‌తోపాటు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును నర్సంపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన జినుకల జ్యోతి అందుకున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమంలో పలు రకాల పోటీ పరీక్షలు నిర్వహించగా జ్యోతి ప్రతిభ చాటి ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందుకున్నారు. జ్యోతిని గ్రామస్తులు అభినందించారు.

సన్మానం



వర్ధన్నపేట : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌ను మండలానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం సన్మానించారు. తొలుత మహేశ్‌కుమార్‌ను శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందించి సత్కరించారు. అలాగే జ్యోతిరావుపూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.

ఆర్టీసీ కండక్టర్‌కు..

పర్వతగిరి : ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఈనెలలో ఉద్యోగ విరమణ చేయనున్న మేకల పుష్పను వరంగల్–అన్నారం బస్సులో ప్రతిరోజూ ప్రయాణించే ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం సన్మానించారు. బస్సు నుంచి వేదిక వద్దకు పూలు చల్లుతూ ఆమెను తీసుకొచ్చి పూలమాల వేసి శాలువా కప్పి పట్టుచీర, మెమొంటో బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోరిగం రాములు, రౌతు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సోమేశ్వర్, పుల్లూరి సారంగపాణి, గంగుల వేణు, రావుల దేవేందర్, అశోక్, మంగతాయి, రజిత, సీఆర్‌పీ ప్రవీణ్, బస్ డ్రైవర్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు..

చెన్నారావుపేట : మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, సారంగపాణిలను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భానోతు రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతకుమారి, నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ రాంచందర్ తదితరులు ఆపల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నర్సంపేట : స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గదుల కిరాయిదారుల సంఘం కార్యవర్గాన్ని పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు సదానందం, అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షులుగా అశోక్, మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మధు, కోశాధికారిగా చంద్రమౌళి, సహాయ కార్యదర్శులుగా రాజేందర్, ప్రకాశ్, గౌరవ సలహాదారులుగా రవీందర్, సర్దార్, శరత్, సంతోశ్, కార్యవర్గ వర్గ సభ్యులుగా రవి, మొగిలిచర్ల రాములు, మక్బూల్, కనుకుంట్ల దశరథం, సాంబయ్య, వినయ్ ఎన్నికయ్యారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా అశోక్

దుగ్గొండి : మండలంలోని పొనకల్–గిర్నిబావి అడ్డా ఆటోడ్రైవర్ల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గోవిందు అశోక్, ఉపాధ్యక్షులుగా టి.దయాకర్, మాదాసి సూరయ్య, కార్యదర్శిగా గోవిందు భాస్కర్, కోశాధికారిగా అడప శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా బండి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాచినపల్లి, పొనకల్ గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో క్రమశిక్షణకు బాటలు

నర్సంపేట : ఎన్‌ఎస్‌ఎస్‌తో జీవితంలో క్రమశిక్షణకు బాటలు పడతాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ఆ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి వలంటీర్లుగా సమాజానికి సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాంబాబు, సంధ్య అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బైరి సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ కందాల సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, అధ్యాపకులు రహీముద్దీన్, భద్రు భూక్య, రజిత, రుద్రాణి, గాయత్రి, వీరన్న, మాధవి, నిజాం, భార్గవి, రాకేశ్, దేవేందర్, రమేశ్, అనిత, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పరాచికపు సదానందం మాట్లాడారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ మాదకద్రవ్యాలను పారద్రోలడంలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, సంజీవ, రాజేశ్, తిరుపతమ్మ, రమాదేవి, కృష్ణమూర్తి, సంతోశ్‌కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.



ఖానాపురం : మాట్లాడుతున్న పీఓ సదానందం

రైస్‌మిల్లులో రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

నెక్కొండ: ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ బియ్యం పేరిట రైస్ మిల్లర్లు అక్రమ దందాకు తెర తీస్తున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని గుట్టుగా మండలంలోని చంద్రుగొండ మల్లికార్జున రైస్ మిల్లులో నిల్వ చేశారు. ఆ బియ్యాన్నే దర్జాగా రీ సైకిల్ చేసి ప్రభుత్వానికి పంపించే పనిలో ఉండగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్ పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు జరిపారని తెలిపారు. మిల్లులో సీఎంఆర్‌కు పంపడానికి సిద్ధంగా ఉన్న 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. మిల్లు యాజమాని సంగని సూరయ్యకు చెందిన మిల్లులో 125 బస్తాల్లో నిల్వ చేసిన బియ్యంతోపాటు మిల్లుకు జాటోతు యాకుబ్ తీసుకొచ్చిన బస్తా బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ విభాగం అధికారులకు సమాచారం ఇవ్వగా ఆ శాఖ డిప్యూటీ తహసీల్దార్ స్వప్న అక్కడకు చేరుకుని, రేషన్ బియ్యం శాంపిళ్లు సేకరించారు. మిల్లు వేయింగ్ మిషన్, బియ్యం తరలిస్తున్న టీవీఎస్ చాంప్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఆమె సీజ్ చేశారు. ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



పైరిక్రమ్ పిచికారీ చేస్తున్న సిబ్బంది

రాయపర్తి : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పైరిక్రమ్ మందు పిచికారీ చేయించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్లు శ్యాంసుందర్, మథ్యాస్‌రెడ్డి, ప్రేమ్‌ప్రసాద్, ఏఎన్‌ఎంలు జయలత, వనిత, ఆశావర్కర్ రాజేశ్వరి, సరస్వతి, రజియ, రజిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

నర్సంపేట : సర్పంచ్, ఎంపీటీసీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాలులో ఆరు మండలాల మాజీ ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తాము గ్రామాల అభివృద్ధి కోసం అప్పు చేసి పనులు చేపట్టగా ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. తమ కుటుంబాలు ఆర్థికంగా చితికి రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఈనెల 26న మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని, 27న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మాదాసి రవి, తిరుపతిరెడ్డి, అనుముల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలను నిలపొద్దు

రాయపర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలను నిలపొద్దని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి కోరారు. స్థానిక బస్టాండ్‌ను మంగళవారం ఆమె సందర్శించి పరిశీలించారు. ప్రైవేట్ వ్యక్తుల వాహనాలు నిలిపి ఉండడాన్ని గమనించి మాట్లాడారు. బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేట్ వాహనాలను నిలపడం వల్ల బస్సులు బస్టాండ్‌లోకి రాక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

నర్సంపేట : ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, నాయకులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకురాలు పైల చంద్రక్క, కేంద్ర కమిటీ నాయకుడు ముక్తార్ బాషా చిత్రపటాలకు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం రాజేందర్, కృష్ణ, తిరుపతి మాట్లాడారు. చంద్రక్క, ముక్తార్ బాషా మృతి విప్లవోద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు బోగి సారంగపాణి, ఆకుల వెంకటస్వామి, ఐలన్న, పూలక్క, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాధన్నపేటకు చెందిన నిమ్మల సుమన్ (35) నర్సంపేటలో వాటర్ సర్వీస్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా మంగళవారం నాడు సుమన్ ఉదయం రోడ్డుపై పురుగుల మందు తాగి పడిపోగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు.

అనారోగ్యంతో డైరెక్టర్ మృతి

నల్లబెల్లి : మండలంలోని గుండ్లపహాడ్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చల్లా యాదగిరి (45) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఆయన అస్వతస్థతకు గురి కాగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

పర్వతగిరి : మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మండలంలోని అనంతారంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన చెప్పారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

ఖానాపురం : మండలంలోని గొల్లగూడెంతండాకు చెందిన గుగులోతు కిషన్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కిషన్ గొల్లగూడెంతండా పరిధిలో గతంలో కొత్తపోడు చేసుకున్న పేదల భూములను కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద అక్రమంగా పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు నేడు స్పాట్ కౌన్సెలింగ్

పర్వతగిరి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన ఎంపీసీ, బైపీసీ 15 సీట్లకు నేడు (బుధవారం) స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉదయం సాయంత్రం 4 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. అర్హులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడల ప్రారంభానికి ఆహ్వానం

వర్ధన్నపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడాపోటీల ప్రారంభానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రఘువీర్ మంగళవారం ఆహ్వానించారు. తొలుత ఎమ్మెల్యేను వెంకటేశ్వర్లు, రఘువీర్ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం మాట్లాడారు. ఈనెల 28, 30 తేదీల్లో నిర్వహించనున్న క్రీడల ప్రారంభోత్సవానికి రావాలని కోరారు.

ఆకాశవాణి 'కదంబ'లో విద్యార్థుల సందడి

దుగ్గొండి : వరంగల్‌లోని ఆకాశవాణి కేంద్రంలో 'చిన్నారిలోకం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం నిర్వహించిన 'కదంబ' కార్యక్రమంలో మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి విద్యార్థిని సమన్విత యాంకర్‌గా వ్యవహరించగా విద్యార్థులు జ్యోతి, అక్షిత, నికిత, కరుణశ్రీ, లాస్య, లిఖిత, తేజశ్రీ, అస్మిత, వర్షిణి కవితలు, కథలు చెప్పారు. పాటలు పాడారు. విద్యావ్యాసాలు వినిపించారు. ప్రతిభ చాటి అలరించారు. ఆహూతులను ఆకట్టుకున్నారు. గైడ్ టీచర్‌గా చిలువేరు శ్రీనివాసులు వ్యవహరించారు. విద్యార్థులను హెచ్‌ఎం హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సారయ్య, రఘు, స్వప్న, వేణుగోపాల్ అభినందించారు.

సైన్స్ మేళా, యువజన ఉత్సవాలకు సంప్రదించండి

దుగ్గొండి : జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26, 28 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ మేళా, యువజనోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ఆసక్తి కలిగిన యువత, విద్యార్థులు ఈనెల 26లోగా మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ అరుంధతి ఒక ప్రకటనలో కోరారు. 15 నుంచి 29 ఏళ్ల వరకు వయస్సున్న విద్యార్థులు, యువత జానపద నృత్యాలు, జానపద గీతాలు, కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలు, నూతన ప్రాజెక్టులు, తదితర పోటీల్లో పాల్గొనేందుకు 7702155096కు వివరాలు వాట్సాప్ చేయాలని సూచించారు.

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నర్సంపేట : స్థానికులకు నర్సంపేటలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూలక్క, వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సంధ్య, సుకన్య, శిరీష, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన.. విరమణ

వర్ధన్నపేట : ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన బాధితులు పెద్దమనుషుల జోక్యంతో విరమించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఈనెల 20న ఐనవోలుకు చెందిన కల్లెం రవీందర్, రజిత ప్రయాణిస్తున్న ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్, రజిత గాయాలపాలు కావడంతో పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బాధితుల కుటుంబాలు ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో గ్రామ పెద్దలు జోక్యం చేసుకున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. బాధిత కుటుంబం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును సైతం ఉపసంహరించుకుంది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సంగెం : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎల్.నరేశ్ ఆకాంక్షించారు. మండలంలోని కాపులకనిపర్తిలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, తదితరాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. యువత, ప్రజలు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అపరిచితులకు ఏటీఎం కార్డు వివరాలు ఇవ్వొద్దని, తదితర సూచనలు చేశారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై సీతారాం, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాస్త్ యాప్‌తో వైకల్యం గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న సుభాశ్

చెన్నారావుపేట : ప్రశాస్త్ యాప్‌తో విద్యార్థుల్లోని వైకల్యాన్ని గుర్తించవచ్చని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) గుండ్రాతి సుజన్ తేజ, జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ కుడికాల సుభాశ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. యాప్‌లో పేర్కొన్న అంశాల ఆధారంగా వైకల్యాన్ని గుర్తించాలని సూచించారు. వైకల్యాన్ని గుర్తిస్తే సదరం సర్టిఫికెట్ అందించడంలోనే కాకుండా ఆరోగ్యపరమైన సూచనలు అందించొచ్చని తెలిపారు. అనంతరం కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయను వారు సందర్శించి తరగతి బోధనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంఈఓ రత్నమాల, కాంప్లెక్స్ హెచ్‌ఎం మానుపాటి పాపమ్మ, హెచ్‌ఎంలు జయ, సలీం, రవీందర్‌రెడ్డి, భద్రయ్య, సీఆర్‌పీలు సంపత్, స్వామి, శిల్ప, ఎంఆర్‌సీ సిబ్బంది అశోక్, స్వప్న, మెసెంజర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయం



నెక్కొండ : మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ



ఖానాపురం : మాట్లాడుతున్న సునీతాదేవి

● ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ

నెక్కొండ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతోందని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ తెలిపారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లీబిడ్డల సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎత్తు, బరువును రోజువారీగా పరిశీలించి పోషణ లోపం ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు చెప్పారు. తల్లిపాల ప్రాముఖ్యతపైనా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. నెల రోజులపాటు పిల్లల ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేసి అవసరమైన పోషకాలపై తల్లులను చైతన్యవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీడీపీఓ శ్రీదేవి, హేమలత, విద్యోదయ స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్ పారిజాతం, పీహెచ్‌సీ వైద్యాధికారి రహేలా తస్వీర్, ఏపీఎం శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యమ్మ, హేమలత, నజ్మా బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యురాలు సునితాదేవి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అందుబాటులో ఉండే ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమ, అంగన్‌వాడీలు రాణి, మంజుల, శాంత, ఐలమ్మ పాల్గొన్నారు.

'సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం'



పర్వతగిరి : సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు



సంగెం : సభ్యత్వ నమోదు చేస్తున్న శ్రీనివాస్

పర్వతగిరి : సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలం పెరిగి అధికారం చేజిక్కించుకోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రనూ పోషించలేకపోతోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్తిరెడ్డి కేశవరెడ్డి, పట్టాపురం ఏకాంతం గౌడ్, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, స్థానిక నాయకుడు బొట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కొత్తగూడెం, ముమ్మడివరం, ఎల్గూర్ రంగంపేట గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. దేశ రక్షణ కోసం పార్టీలో చేరాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్క శ్రీనివాస్, సతీశ్, పరికి స్వామి, వాసం సురేశ్, వడ్డి దేవేందర్‌రెడ్డి, రొట్టె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత కీలకం



ఖానాపురం : భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఎన్ఓ

దుగ్గొండి : మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం కీలకమని తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ లెక్కల అరుంధతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని వారు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం, కూరలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రుచి చూశారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన శాంపిల్ తీసి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా నిల్వ చేసిన టేకు కర్రను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని తెలిసిందని, వారిని గుర్తించి కేసులు నమోదు చేయిస్తామని చెప్పారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఎన్ఓ చరణ్‌సింగ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌పీ మహేందర్, టెక్నీషియన్లు రాజేందర్, రజినీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అవగాహన పెంచడమే లక్ష్యం

నర్సంపేట రూరల్ : విద్యార్థుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో ఎన్‌సీసీ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహేశ్వరం శివారులోని చెరువులోని వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలతో నదుల్లోని నీరు కలుషితమై మానవ జీవితానికి విఘాతం కలుగుతుందని చెప్పారు. చెరువులను శుభ్రంగా ఉంచుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన బాధ్యత తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కారక్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్, రామ్మూర్తి, యాకూబ్‌రెడ్డి, శ్రీశైలం, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



చెరువులోని వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు